# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 15-03-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ విద్యార్థులు అభివృద్ధి చేసే నూతన అంకుర సంస్థలకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని కేంద్ర సమాచార, ప్రసార, ఐటీ శాఖల మంత్రి అశ్విని వైష్ణవ్ పేర్కొన్నారు.
- ❖ వినియోగదారులను అన్ని విధాలా రక్షించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర వినియోగదారుల వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి అన్నారు.
- ❖ కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రి మన్సుఖ్ మాండవీయ రేపు న్యూఢిల్లీలోని జెఎల్ఎన్ స్టేడియంలో ఫిట్ ఇండియా కార్నివాల్‌ను ప్రారంభించనున్నారు.
- ❖ వచ్చే సంవత్సరం గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రకటించనున్న పద్మ అవార్డులు కోసం నామినేషన్లు ఈ రోజు ప్రారంభమయ్యాయి.
- ❖ ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 120వ సంచిక ఈనెల 30న ప్రసారమవుతుంది.

==============================

విద్యార్థులు అభివృద్ధి చేసే కొత్త స్టార్టప్‌లకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని కేంద్ర సమాచార, ప్రసార, ఐటీ శాఖల మంత్రి అశ్విని వైష్ణవ్ పేర్కొన్నారు. ఈరోజు చెన్నై సమీపంలోని శ్రీపెరంబుదూర్‌లో జెట్‌వర్క్ ఎలక్ట్రానిక్స్ తయారీ కేంద్రం ప్రారంభోత్సవంలో కేంద్రమంత్రి మాట్లాడుతూ... విద్యార్థులు వినూత్న సాంకేతిక నమూనాలపై దృష్టి పెట్టాలని కోరారు. అమృత్ పథకం కింద 77 రైల్వే స్టేషన్లను పునరుద్ధరించడానికి, అలాగే 715 రైల్వే ఓవర్ బ్రిడ్జిలను నిర్మించడానికి ప్రణాళికలు వేస్తున్నట్లు ఆయన పేర్కొంటూ...

(వాయిస్ 33 సెకన్లు)

==============================

వినియోగదారులను  అన్ని విధాలా రక్షించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర వినియోగదారుల వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి అన్నారు. ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా దృశ్య మాధ్యమ విధానం ద్వారా ఈ రోజు జరిగిన వెబ్‌నార్‌లో ఆయన మాట్లాడుతూ.... వినియోగదారుల సాధికారతపై దృష్టి సారించడం ద్వారా ప్రభుత్వం ఫిర్యాదుల పరిష్కార యంత్రాంగాన్ని ఆధునీకరించిందని స్పష్టం చేశారు. వినియోగదారుల రక్షణ నియమాలు, ఈ-కామర్స్ రంగంలో అన్యాయమైన వాణిజ్య పద్ధతుల నుండి వినియోగదారులను రక్షించడంలో సహాయపడిందని తెలిపారు. స్థిరమైన ఉత్పత్తులను మరింత అందుబాటులోకి తీసుకురావడానికి ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి పేర్కొన్నారు. పర్యావరణ అనుకూల తయారీ ప్రక్రియలు స్వీకరించడానికి ప్రభుత్వం పరిశ్రమలను ప్రోత్సహిస్తోందని ఆయన పేర్కొన్నారు.

==============================

కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రి మన్సుఖ్ మాండవీయ రేపు  న్యూఢిల్లీలోని జెఎల్ఎన్ స్టేడియంలో ఫిట్ ఇండియా కార్నివాల్‌ను ప్రారంభించనున్నారు. మూడు రోజుల పాటు జరిగే ఫిట్ ఇండియా ఉద్యమం ద్వారా ఆరోగ్యం మెరుగవ్వటానికి రోప్ స్కిప్పింగ్, స్టేషనరీ సైక్లింగ్, ఆర్మ్ రెజ్లింగ్, క్రికెట్ బౌలింగ్ వంటి అనేక క్రీడా కార్యకలాపాలు దోహదం చేస్తాయని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాబోయే ఖేలో ఇండియా పారా గేమ్స్ లోగోను, గీతాన్ని  ఆవిష్కరించనున్నారు. ఖేలో ఇండియా పారా గేమ్స్  ఈనెల 20వ తేదీన దేశ రాజధానిలో ప్రారంభంకానున్నాయి.

==============================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 120వ సంచిక ఈనెల 30వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్  కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు  ఈనెల 28వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

==============================

ఓటర్ల జాబితా సమాచారాన్ని మోసపూరితంగా మార్చారనే ఆరోపణల నేపథ్యంలో ఓటరు గుర్తింపు కార్డులను ఆధార్‌తో అనుసంధానించే అంశంపై చర్చించేందుకు ఈనెల 18వ తేదీన ఎన్నికల కమిషన్ సమావేశం జరగనుంది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ఈ మేరకు న్యూఢిల్లీలో కేంద్ర హోం శాఖా కార్యదర్శి, శాసనసభ కార్యదర్శులతో  ఈ రోజు సమావేశమయ్యారు. ఎన్నికల అధికారుల స్థాయిలో పరిష్కారం కాని సమస్యలపై సూచనలను భారత ఎన్నికల కమిషన్ ఏప్రిల్ 30 నాటికి అన్ని జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీల నుండి ఆహ్వానిస్తుందని అధికార వర్గాలు తెలిపాయి.

విరామం

==============================

అస్సాం రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెందుతోందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. అత్యాధునిక వసతులతో పునరుద్ధరించిన లచిత్ బర్ఫుకాన్ పోలీస్ అకాడమీని ఈరోజు ప్రారంభించడంతో పాటు.. దేర్గావ్‌లో పోలీస్ అకాడమీ గృహనిర్మాణ ప్రాజెక్టులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో రాష్ట్రంలో ఇప్పుడు శాంతి నెలకొందని పేర్కొన్నారు. దీని ఫలితంగా వ్యాపార రంగం అభివృద్ధి చెందుతోందని, ఇది యువతకు ఉద్యోగ అవకాశాలను కల్పిస్తోందన్నారు. అస్సాం రాష్ట్రానికి కేంద్రం 3 లక్షల కోట్ల రూపాయల ప్రాజెక్టులను అందిస్తుందని, ఇది మౌలిక సదుపాయాల రంగాన్ని బలోపేతం చేసేందుకు దోహదపడుతుందని అమిత్ షా మాట్లాడుతూ...

(వాయిస్ 40 సెకన్లు)

=============================

వచ్చే సంవత్సరం గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రకటించనున్న పద్మ అవార్డులు కోసం నామినేషన్లు ఈ రోజు ప్రారంభమయ్యాయి. పద్మ అవార్డులకు నామినేషన్లు దాఖలు చేయడానికి చివరి తేదీ జులై 31. ఈ అవార్డులకు నామినేషన్లు, సిఫార్సులు రాష్ట్రీయ పురస్కార్ పోర్టల్‌లో ఆన్‌లైన్‌లో మాత్రమే స్వీకరించబడతాయని అధికారులు పేర్కొన్నారు. దేశంలోని అత్యున్నత పౌర పురస్కారాలలో ఒకటిగా నిలిచిన ఈ పద్మా అవార్డులు 'విశిష్టమైన కృషి'ని గుర్తించడానికి దోహదపడతాయి. కళ, సాహితత్యం, విద్య, క్రీడలు, వైద్యం, సామాజిక సేవ, సైన్స్, ఇంజనీరింగ్, ప్రజా వ్యవహారాలు, పౌర సేవ, వాణిజ్యం, పరిశ్రమ వంటి అన్ని విభాగాలలో ఈ విశిష్ట అవార్డులను అందజేస్తారు.

=============================

యూనైటెడ్ కింగ్ డమ్ (UK)లో లండన్‌లోని సెంట్రల్ బ్యాంకింగ్ ద్వారా డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ అవార్డు 2025కి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా - (RBI) ఎంపికైంది. ఆర్‌బీఐ అంతర్గత డెవలపర్ బృందం అభివృద్ధి చేసిన ప్రవాహ్, సారథి అనే డిజిటల్ కార్యక్రమాలకు గాను ఈ అవార్డును అందుకుంది. ఈ డిజిటల్ కార్యక్రమాల ద్వారా కాగితం ఆధారిత సమర్పణల వినియోగాన్ని ఎలా తగ్గించాలి, తద్వారా RBI అంతర్గత, బాహ్య ప్రక్రియలను ఎలా మార్చాలనే అంశాలను ఈ అవార్డుల కమిటీ గుర్తించింది.

=============================

‘‘తమిళం చాలా మధురమైన భాష అని కేంద్ర ప్రసారాలు, ఐటీ శాఖా మంత్రి అశ్వని వైష్ణవ్ అన్నారు. ఈ రోజు తమిళనాడు చెన్నై సమీపంలోని శ్రీపెరంబుదూర్‌లో జెట్‌వర్క్ ఎలక్ట్రానిక్స్ తయారీ కేంద్రం ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడుతూ... అన్ని భారతీయ భాషలను ఆస్వాదిద్దామని... అలాగే ప్రతిభాషకు ప్రత్యేక స్థానం, గుర్తింపు రావాలని కోరారు.  అదేవిధంగా భారతదేశాన్ని ఐక్యంగా మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారడానికి ప్రతీ ఒక్కరూ సహకారం అందించాలని కేంద్ర మంత్రి పేర్కొన్నారు.

=============================

LVM3 లాంచ్ వెహికల్ ఆరవ ఆపరేషనల్ మిషన్ కోసం నియమించబడిన క్రయోజెనిక్ ఇంజిన్ యొక్క ఫ్లైట్ యాక్సెప్టెన్స్ హాట్ టెస్టింగ్‌ను ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ (ISRO) విజయవంతంగా పూర్తి చేసింది. ఈరోజు తమిళనాడులోని మహేంద్రగిరిలోని ఇస్రో ప్రొపల్షన్ కాంప్లెక్స్‌లో ఈ పరీక్ష నిర్వహించారు.

=============================
=============================